తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కౌటాల గ్రామంలో తాగునీటి సమస్యను తెలుసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి సాగర్

నమస్తే ఎఫెక్ట్

నార్నూర్, ఫిబ్రవరి 21 : తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సాగర్ అన్నారు. తాగునీటి తంటాలు అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం మేడిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కౌటాల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిశీలించారు. మోటరు మరమ్మతు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి జైలు

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 21: డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి జైలు, జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం శుక్రవారం తీర్పు ఇచ్చిందని కోర్టు సమన్వయ అధికారి డల్లుసింగ్ తెలిపారు. నిర్మల్‌లోని శాస్త్రీనగర్ కాలనీకి చెందిన నర్సయ్య టైలర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నర్సయ్య లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన సతీశ్ వద్ద అవసరం నిమిత్తం రూ.50 వేలు అప్పు తీసుకున్నాడు. తిరిగి రూ.39 వేలు చెల్లించాడు. మిగతా డబ్బుల కోసం సతీశ్ తరచూ షాపుకు వెళ్తు వేధించేవాడు. 22 జూన్ 2015వ తేదీన నర్సయ్య భార్య షాపులో ఉన్న సమయంలో సతీశ్ వచ్చి గొడవ పడి ఆమె తలపై గాయపర్చాడు. విచారణ చేపట్టి చార్జ్‌షీట్ వేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. సెషన్ జడ్జి సతీశ్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.

బస్‌షెల్టర్‌లో నిలిపిన ద్విచక్రవాహనాలు

బస్ షెల్టర్‌లో వాహనాలు.. ఎండలో ప్రయాణికులు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌లో ద్విచక్రవాహనాలు నిలిపివేయడంతో స్థలం లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైన ఎండలో నిలబడాల్సి వస్తుంది. బోథ్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు క్రాస్ రోడ్డు వద్ద దిగి బస్సు మారుస్తుంటారు. జాతీయ రహదారుల అధికారులు స్పందించి బస్ షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- బోథ్, ఫిబ్రవరి 21

ఎండలో నిల్చోని బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- **నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 21 : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గడం, నీటి మట్టాలు పడిపోవడం వంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రణాళికంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగినిభాను, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో రాజేందర్, డీఏవో అంజిప్రసాద్, డీసీహెచ్‌వో సురేశ్, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు అధికారులు పాల్గొన్నారు.

అధిక ప్రమాదం ఉన్న గర్భిణులను గుర్తించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 21 : అధిక ప్రమాదం ఉన్న గర్భిణులను వెంటనే గుర్తించాలని నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. నిర్మల్‌లో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెంట్ ట్రాకింగ్ మేనేజ్‌మెంట్‌పై ఏఎన్‌ఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అధిక ప్రమాదం ఉన్న గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన సేవలను అందిస్తూ ఎటువంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేకుండా ప్రసవమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. డాక్టర్ అఖిల, డాక్టర్ సంతోషిణి గర్భిణులకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలను అందించడానికి ట్రాక్ చేయడానికి అవసరమైన శిక్షణ ఆరోగ్య సహాయకులకు కల్పించారు. కార్యక్రమంలో పీవో డాక్టర్ సౌమ్య, జిల్లాలోని మహిళా ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఖోఖో ప్రపంచ కప్ టీం సభ్యుడికి సన్మానం

ఎదులాపురం, ఫిబ్రవరి 21: భారత ఖోఖో జట్టు, విశ్వ విజేత సభ్యుడు, ఆదిలాబాద్ పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగి శివారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం ఆదిలాబాద్‌లోని తపాల శాఖ కార్యాలయంలో పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్దార్థ, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి శివారెడ్డిని శాలువాతో సన్మానించారు. అదే విధంగా జూడో ఇంటర్నేషనల్ క్రీడాకారిణి మలప్రభును సత్కరించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యూనివర్సిటీ ఉషూ పోటీలకు న్యాయనిర్ణేతగా శ్రీరాముల సాయికృష్ణ

భైంసా, ఫిబ్రవరి 21 : చండీఘడ్ రాష్ట్రం చండీఘడ్ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఆల్ ఇండియా యూనివర్సిటీ ఉషూ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రీరాముల సాయికృష్ణను ఎంపిక చేసినట్లు అమెచ్యూర్ ఉషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఒమర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర్గత పరీక్షల మూల్యాంకనం పరిశీలన

సోన్, ఫిబ్రవరి 21: నిర్మల్ జిల్లా సోన్ మండలం సిద్దులకుంట గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత పరీక్షల మూల్యాంకనం శుక్రవారం సారంగాపూర్ మండలం జాం ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, ఉపాధ్యాయులు మోహన్‌రావు, రాజేశ్వర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, దశరథ్, నరేందర్, భూమారెడ్డి, ముర్తుజాఖాన్ ఉన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన

బోథ్, ఫిబ్రవరి 21: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హక్కులకు భంగం కలిగితే వెంటనే 1098 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, డీసీపీయూ ఔట్‌రీచ్ వర్కర్ అశ్విని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న నిర్మల్ జిల్లాకు సీఎం రాక

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 21:ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 24వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రులతో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ తెలిపారు.

పనులకు అనుమతులు ఇవ్వాలి

నార్నూర్, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయంలో జిల్లా ఫారెస్ట్ అధికారి, రేంజ్ అధికారిని శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దూదేరావ్, గాదిగూడ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని అటవీ శాఖ పరిధిలో మంజూరైనా బీటీ రోడ్ల నిర్మాణానికి, గిరివికాసం ద్వారా వచ్చిన కరెంట్ లైన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అటవీ శాఖ జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

జీపీ నిధుల దుర్వినియోగం

కుభీర్, ఫిబ్రవరి 21: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సిర్పెల్లి(హెచ్) జీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన గంట గణేశ్ శుక్రవారం కుభీర్‌లో ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్టీఐ ద్వారా 2020 ఫిబ్రవరి నుంచి 21 ఫిబ్రవరి 2025 వరకు జీపీకి వచ్చిన నిధులు, ఖర్చులకు సంబంధించి పూర్తి సమాచారంతో కూడిన ప్రతులు అందజేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి అజీజ్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయం

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 21 :భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ప్రవాసీ మిత్ర కార్మిక సంఘ ధ్యేయమని యూనియన్ అధ్యక్షుడు సురేశ్ పరికిపండ్ల అన్నారు. నిర్మల్ జిల్లాలో భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న సెంట్రింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, టైల్స్, కార్పెంటర్, ఇలా అనేక మంది కార్మికులు సంక్షేమ బోర్డులో పేరును నమోదు చేసుకోవడం లేదని అన్నారు. గ్రామీణ కార్మికులు అయితే పంచాయతీ కార్మికుల ధృవీకరణ పత్రం పట్టణ ప్రాంతం వారు వార్డు అధికారి ధృవీకరణ పత్రం అడగడంతో కార్మికులు నమోదుకు ఉత్సాహం చూపడం లేదని అన్నారు. అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్మికులు పేర్ల నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటే 8247511415 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సొసైటీ అధ్యక్షుడు మోహన్, గీత, లావణ్య, బాలయ్య, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్‌లోని టీఎన్జీవో సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలుకు నోచుకొని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం మహిళలకు రూ.2500, పింఛన్ రూ.4 వేలు, పెండ్లి కానుకగా తులం బంగారం, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి, పద్మ, నూతన్ కుమార్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

1988-89 బ్యాచ్ విద్యార్థులు

కడెం, ఫిబ్రవరి 21 : నిర్మల్ జిల్లా కడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89 పదో తరగతి చదివిన వారు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. అప్పుడు విద్య నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. పాఠశాలలో చదువుకున్న రోజులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

కేసీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సారంగాపూర్, ఫిబ్రవవరి 21: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని తాండ్ర(జీ), సారంగాపూర్ గ్రామాల్లో శుక్రవారం కేసీఆర్ తెలంగాణ బలం క్యాలెండర్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవిశంకర్, లక్ష్మీనారాయణగౌడ్, బోసాని భోజన్న, చిన్నోల్ల నర్సయ్య, చిన్నయ్య, ధనుంజయ్, సాయినాథ్, కృష్ణ, భూమేశ్, అల్లిసాబ్, గంగవ్వ, స్వామి పాల్గొన్నారు.

సోషలిస్టు వ్యవస్థనే ప్రత్యామ్నాయం

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : పెట్టుబడి దారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో రెడ్ బుక్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్త్రాత్రి, జిల్లా కమిటీ సభ్యులు సురేందర్, జమున, స్వామి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తాం

బేల, ఫిబ్రవరి 21: పెన్‌గంగ నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని తహసీల్దార్ రఘునాథ్ రావ్ అన్నారు. శుక్రవారం పెన్‌గంగ నుంచి అక్రమంగా రాత్రి వేళల్లో ఇసుక రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ దివ్య భారతితో కలిసి కంఫూర్ పూర్‌లో నదిని పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ సాజీద్, పోలీసులు ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కుమ్రం భీం కాలనీలో ఆదివాసీ మహిళా సంఘం తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గొడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మహిళా దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవానికి మహిళలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సంఘం డివిజన్ ఉపాధ్యక్షురాలు సోయం లలిత, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోయం సుమన్ బాయి, మానుకుబాయి, రూపాబాయి, అనసూయ, కనక పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన ఎంఈవో

దస్తురాబాద్, ఫిబ్రవరి 21 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో గంగాధర్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సీఆర్పీ తిరుపతి ఉన్నారు.

గీస శ్రీజకు అక్షరయాన్ సాహిత్య పురస్కారం



గీస శ్రీజ

జైనథ్, ఫిబ్రవరి 21 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్, అభిజ్ఞ భారత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2025 సాహిత్య పురస్కారానికి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కూర గ్రామానికి చెందిన గీస శ్రీజ ఎంపికైంది. మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు గీస శ్రీజకు బాలికా పురస్కారం అందజేసి సన్మానించనున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే శ్రీజ కథలు పుస్తకం రాసి పలువురి మన్ననలు పొందింది. కేంద్ర విద్యాశాఖచే యంగ్ అచీవర్ అవార్డు అందుకోవడంతో పాటు, కేంద్ర సాహిత్య సాంస్కృతిక శాఖ వారు సృజనాత్మక రచన విభాగంలో ఇచ్చే ఉపకార వేతనానికి కూడా ఎంపికైంది. ప్రస్తుతం శ్రీజ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శ్రీజను గ్రామస్తులు అభినందించారు.

ఆర్మీ జవాన్‌పై దాడి: ఇద్దరిపై కేసు

నర్సాపూర్ (జీ), ఫిబ్రవరి 21 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని గొల్లమాడ గ్రామంలో ఆర్మీ జవాన్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిరణ్ శుక్రవారం తెలిపారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి, భూమేశ్ రాత్రి గొల్లమాడ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ భోజరాజుపై దాడి చేశారు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. బాధితుడి సోదరుడు లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై..

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 21: ఇంద్రవెల్లిలోని భీంనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేశారు. రూ. 2,594 విలువైన మద్యంను స్వాధీనం చేసుకొని బెల్ట్ షాపు నిర్వాహకుడు రాథోడ్ ప్రేమ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

ఐదు వాహనాలు సీజ్

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 21: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ముతుజ ఆలీతో పాటు ప్రొబిషన్ ఏఎంవీఐలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని, ప్రభుత్వానికి చెందిన పన్ను చెల్లించని నాలుగు లైట్ గూడ్స్ వాహనాలు, ఒక టిప్పరును పట్టుకొని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ప్రొబిషన్ ఏఎంవీఐలు రజనీకాంత్, అక్షయ్ పాల్గొన్నారు.

రోడ్డ ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌కు చెందిన ఆత్రం శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై ఉట్నూర్‌కు వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెంబి, ఫిబ్రవరి 21: మొక్కజొన్న చేనులో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని నాగాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం... నాగాపూర్ గ్రామానికి చెందిన రాపెని మైసయ్య (47)కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మైసయ్య అదే గ్రామంలో ఒక ఎకరం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన పెద్ద కొడుకు మహేశ్‌తో కలిసి మొక్కజొన్న పంట కాపలకు వెళ్లాడు. పంట చేనులో రాత్రి పూట వెలుతూరు కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు తగలడంతో మైసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రిని కాపాడే క్రమంలో కొడుకు స్వల్పంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లకు వేలం

దస్తురాబాద్, ఫిబ్రవరి 21: అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుపడిన ఇసుక ట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ వేలం నిర్వహించారు. జప్తు చేసిన రెండు ట్రాక్టర్ల ఇసుకను మున్యాల గ్రామానికి చెందిన దొనకంటి స్వామి రూ. 3600కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మళ్లీ కేసీఆర్ సారే ముఖ్యమంత్రి కావాలి

కేసీఆర్ చిత్ర పటానికి జలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 21: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ మళ్లీ సీఎం కావాలని బీఆర్ఎస్వీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండి తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి అయి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రంజాన్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రంజాన్ పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు మసీదులు, ఈద్గాల వద్ద నీటి వసతి, వీధి దీపాలు, నిరంతర కరెంట్ సౌకర్యం, తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంజాన్ నెలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులు మార్చి 2 నుంచి 31వ తేదీ వరకు సాయంత్రం 4 గంటలకే కార్యాలయ విధులు నిర్వహించుకొని ఇళ్లకు వెళ్లవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే బడ్జెట్

దస్తురాబాద్, ఫిబ్రవరి 21 : కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే బడ్జెట్ తప్ప, కష్ట జీవులకు ఏ మాత్రం ఉపయోగం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో శుక్రవారం సీఐటీయూ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంబానీ, అదానిలే తప్ప, సామన్య ప్రజలకు ఉపయోగం లేదని పేర్కొన్నారు. సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతాంగానికి ఊరటను ఇచ్చే విధంగా గానీ, కొత్త పథకాలు ప్రకటన నిర్ణయాలు లేవని అన్నారు.కార్మిక వర్గానికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక నిర్ణయాల అమలుకు ఈ బడ్జెట్ ఊతమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల దొంగతనాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 21: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఈశ్వర్‌నగర్‌కు చెందిన జైదుర్గా వైన్స్‌షాపులో గురువారం రాత్రి చోరీ జరిగిందని దొంగతనానికి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి దొంగలు వైన్స్‌షాపు షటర్‌ను తొలగించి లోనికి చోరబడి రూ. 3,960 విలువ గల మద్యం బాటిళ్లతో పాటు నగదు రూ.5 700 ఎత్తుకెళ్లారు. షాపులో ఉన్న సీసీ కెమెరాలు, సీసీ టీవీని ధ్వంసం చేశారు.వైన్స్ షాప్‌ను సందర్శించి దొంగతనంపై అన్ని కోనాల్లో పరిశీలన చేశామని తెలిపారు. సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలిస్తున్నామని తెలిపారు. దొంగతనం జరిగిన తీరును వైన్స్‌షాపు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నామన్నారు. వైన్స్‌షాపు నిర్వాహకుడు ముండే బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

లోకారి(కే) మార్కెట్ దుకాణాల్లో...

నార్నూర్, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని లోకారి(కే) మార్కెట్‌లోని దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. లోకారి(కే) గ్రామానికి చెందిన గౌడ్, జాడే ప్రహ్లాద్, మీసేవ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు వ్యాపారస్తులు తెలిపారు. గౌడ్ కిరాణా దుకాణంలో రూ.15వేలు, ప్రహ్లాద్ దుకాణంలో రూ.40వేలు, మీ సేవ కేంద్రంలో రూ.7వేలు దొంగతనం చేసినట్లు బాధితులు తెలిపారు. గాదిగూడ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. త్వరలోనే దొంగలను పట్టుకునేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

భార్య రావడం లేదని టవర్ ఎక్కిన భర్త

ఉట్నూర్, ఫిబ్రవరి 21: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త టవర్ ఎక్కిన ఘటన ఉట్నూర్‌లో శుక్రవారం జరిగింది. సీఐ మొగిళి వివరాల ప్రకారం..ఉట్నూర్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్న షకీలొద్దీన్‌కు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలోని యువతితో వివాహం జరిగింది. అయితే ప్రసవం కోసం పోయిన ఆమె రావడం లేదు. ఇంట్లో తరచు గొడవ పడడంతో భార్యను హింసించడంతో ఆమె తల్లితండ్రులు పంపించమని హెచ్చరించారు. పైగా పోలీస్ స్టేషన్‌లో కేసు పెడతామని హెచ్చరికలు చేయడంతో మనస్తాపానికి గురైన షకీలొద్దీన్ స్థానిక అంగడిబజార్ జియో టవర్ ఎక్కాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు టవర్ దగ్గరకు చేరుకొని యువకుడిని దిగి రావాలని సూచించిన రాలేదు. నాలుగు గంటల వరకు టవర్‌పైన ఉండడంతో పోలీసులు ఫోన్‌లో సంప్రదించారు. ఎంతకు రాకపోవడంతో చివరికు భార్యను రప్పించి నచ్చజెప్పడంతో టవర్ దిగి వచ్చాడు. పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. మరోసారి ఇటువంటి ఘటనలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దొంగ అరెస్ట్

ఎదులాపురం, ఫిబ్రవరి 21: చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దొంగ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన తిలక్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు చిట్యాల విజయ తన మనువడు మధ్యాహ్న సమయంలో స్కూల్‌లో అన్నం తినిపించి తిరిగి వస్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన ఒక చైన్ స్నాచర్లు మెడలో నుంచి చైన్ లాగడానికి ప్రయత్నించాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. శుక్రవారం నెహ్రూచౌక్‌లో తనిఖీలు చేస్తున్న క్రమంలో అటువైపుగా వస్తున్నా చైన్ స్నాచింగ్‌కు వాడిన ద్విచక్ర వాహనంతోపాటు యువకుడిని పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన బెర వంశీ(25) చైన్ స్నాచింగ్ యత్నాన్ని ఒప్పుకున్నాడు. దీంతో అతనితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెర వంశీని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ గ్రామంలో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. సీఐ మొగిలి తెలిపిన వివరాల ప్రకారం.. హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ బాలుసింగ్, రాధాబాయి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు జాదవ్ వెంకటేశ్ (26) పారామెడికల్ కోర్సు పూర్తి చేశాడు. ఇంట్లో పని చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతుండే వాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది గురువారం రాత్రి పురుగుల మందు తాగి పడుకున్నాడు. ఉదయం నిద్ర లేపే సరికి మృతి చెంది కనిపించాడు. వెంటనే బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో..

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : రెండు మూడు నెలలుగా మేస్త్రి పని దొరకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక వెంట్రుకలకు (హెయిర్)కు వేసే కలర్‌ను తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌కు చెందిన ధమన్ విజయ్(35) ఈ నెల 18వ తేదీన మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ గుట్ట వద్ద మద్యం మత్తులో నిషా హెయిర్ కలర్ తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి అన్న చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత..

కుభీర్, ఫిబ్రవరి 21 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన బెల్లిడిగ నవనీత (22) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నవనీత ఇంట్లో ఒంటరిగా ఉంది. కుటుంబీకులు వేరే గ్రామానికి శుభకార్యానికి వెళ్లగా తండ్రి చేనుకు వెళ్లాడు. మూడు నెలల గర్భిణీ అయినటువంటి నవనీతను శుభ కార్యానికి కుటుంబీకులు తీసుకెళ్లకపోవడంతో మనస్తాపానికి గురైఆమె ఇంట్లో చీరతో ఉరి వేసుకుంది. తండ్రి బక్కన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి 21: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఔషధశాల నిపుణుడు నిల్వ నమోదును స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రమాణికంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, వైద్యాధికారి ఎన్‌సీడీ, సికిల్ సెల్ స్క్రీనింగ్‌ను మెరుగుపర్చాలని సూచించారు. వైద్యాధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ శ్రీధర్, మండల వైద్యాధికారి కిరణ్ ఉన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి 21: రానున్న పదో తరగి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(ఉర్దూ)ను తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రతి విద్యార్థికి అపార్ గుర్తింపు కార్డు జనరేట్ చేయించడమే కాకుండా వాటిని ప్రింట్ తీయించి విద్యార్థులకు అందించడం అభినందనీయమని కొనియాడారు. అలాగే ఇచ్చోడ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంలో అపార్ గుర్తింపు కార్డు జనరేట్ కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట సెక్టర్ అధికారి నారాయణ, ఎంఈవో బిక్కు, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.